అంగరంగ వైభవంగా పూల పండగ


బతుకమ్మకుంటలో..

జనగామ టౌన్, న్యూస్‌టుడే: రామ రామ ఉయ్యాలో.. బతుకమ్మ బతుకమ్మ బంగారు బతుకమ్మ.. ఒక్కేసి పువ్వేసి సందమామ.. ఉయ్యాల పాటలు జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంట మైదానంలో గురువారం మార్మోగాయి. వేలాదిగా పాల్గొన్న మహిళలు ఉయ్యాల పాటలు, కోలాటాలతో మైదానం హోరెత్తిపోయింది. తొమ్మిది రోజుల పాటు నియమనిష్ఠలతో తీరొక్క పువ్వులతో పేర్చిన బతుకమ్మలను, మధ్యలో ప్రతిష్ఠించిన గౌరమ్మలను పూజించిన మహిళలు ఆఖరి ఘట్టం సద్దుల బతుకమ్మ వేడుకను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. బతుకమ్మకుంటలో మున్సిపల్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మకు రంగు రంగుల విద్యుత్ దీపాలతో ప్రజాప్రతినిధుల కోసం వేదిక ఏర్పాటు చేశారు. సాయంత్రం 5.30 గంటల నుంచి అరగంట పాటు తేలికపాటి ముసురు కురిసింది. 6 నుంచి రాత్రి 10 గంటల వరకు వేలాదిగా పాల్గొన్న మహిళల సందడితో కుంట కొత్త కళ సంతరించుకుంది. భారాసకు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లతో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆయన సతీమణి నీలిమ వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం నిమజ్జనం చేసిన మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. వేడుకల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.జమున, డీసీపీ రాజమహేంద్రనాయక్, ఆర్డీవో కొమురయ్య, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి


తొర్రూరులో మహిళలతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


నిమజ్జనం చేస్తూ..


బతుకమ్మకుంటలో ..


స్టేషన్‌ఘన్‌పూర్: చాగల్లులో..

డీఎస్సీ విజేతలు రిపోర్టు చేయాలి

జనగామ అర్బన్: డీఎస్సీలో విజేతలై బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకున్న వారు నేడు(శుక్రవారం) డీఈవో కార్యాలయంలో రిపోర్టు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 199 మందికి గాను 178 మంది రిపోర్టు చేయడం జరిగిందని, మిగతా 21 మంది నేడు రిపోర్టు చేయాలని సూచించారు.

మూలుగుతున్న నిధులు.. మూలకు చేరిన పనులు

జనగామ, న్యూస్‌టుడే: అన్నీ ఉన్నా.. ఏదీ కాదన్నట్లుంది జనగామ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి. వివిధ రూపాల్లో ఆదాయం ఏటా రూ.కోట్లలో ఉన్నా, మార్కెట్ అభివృద్ధి, రైతులకు ప్రత్యేక సేవలు అంతంత మాత్రమే. విపణిలో రూ.కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులు తుది దశలో నిలిచాయి. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో 18 మాసాల క్రితం నిలిచిన పనులకు మోక్షం లభించడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ధాన్యం పెద్ద ఎత్తున వస్తోంది. ఉన్న కవర్‌షెడ్లు చాలడం లేదు. వర్షం కురిస్తే వ్యవసాయ ఉత్పత్తులు తడిసి ముద్దయ్యే ప్రమాదం ఉంది.


కవర్‌షెడ్లో చోటు లేక బయటనే క్రయ, విక్రయాలు

నెలల తరబడి జాప్యం..

మార్కెట్ ఆదాయాన్ని అధికారులు, పాలకవర్గం వినియోగించే స్వేచ్ఛ లేదు. గత ప్రభుత్వం అన్ని శాఖల ఆదాయాన్ని నేరుగా ఇ-కుబేర్ ద్వారా ప్రభుత్వ ఖాతాకు జమ చేసే విధానాన్ని అమలు చేసింది. ఈ నిధులను ఖర్చు చేసేందుకు తిరిగి ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ కారణంగా ప్రతిపాదించిన పనులకు ఆమోదం రావాలన్నా, ప్రారంభించిన పనులను పూర్తి చేయాలన్నా నెలల తరబడి జాప్యం జరుగుతోంది.

షెడ్లు సరిపోక అన్నదాతల అవస్థలు..

ప్రస్తుత మార్కెట్ కమిటీ కార్యాలయం శిథిలావస్థకు చేరిందనే కారణంతో మరోచోట రూ.50 లక్షలతో కొత్త కార్యాలయం, రూ.20 లక్షలతో ఓవర్‌హెడ్ నీటి ట్యాంకు, రూ.80 లక్షల వ్యయంతో అదనపు కవర్‌షెడ్ పనులకు 25.05.2022న శంకుస్థాపన జరిగింది. 90 శాతం పనులు పూర్తయ్యాయి. బిల్లులు రాకపోవడంతో జూన్ 2023లో గుత్తేదారులు పనులు నిలిపివేశారు. గత ఖరీఫ్, రబీ సీజన్లో మార్కెట్ యార్డులో సుమారు 2 లక్షల క్వింటాళ్ల ధాన్యం క్రయ, విక్రయాలు జరిగాయి. ఆగస్టు చివరి వారం నుంచి ఈ నెల 5 వరకు 40 వేల క్వింటాళ్ల ధాన్యం అమ్మకానికి వచ్చింది. వర్షాలు కురిస్తే ప్రస్తుతం ఉన్న షెడ్లు చాలడం లేదు. ఆరుబయట పోస్తే ఆకస్మిక వర్షాలకు తడిసి, ధర పలకడం లేదని రైతులు వాపోతున్నారు. అదనపు కవర్‌షెడ్ ఫ్లోరింగ్ పనులు పూర్తి చేస్తే అదనపు స్థలం అందుబాటులోకి వస్తుంది.

అటకెక్కిన సద్దిమూట...

కర్షకులు పండించే ధాన్యాన్ని గ్రామాల్లోనే ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా ఖరీదు చేస్తున్నారు. అయినా మార్కెట్‌కు వచ్చే రైతుల సంఖ్య అధికంగానే ఉంటోంది. మార్కెట్‌కు వచ్చే వారికి సౌకర్యాల కల్పనలో భాగంగా తక్కువ ధరకు భోజన సదుపాయం కల్పించేందుకు సద్దిమూట పథకం కొన్ని చోట్ల అమలవుతోంది. ప్రత్యేక శ్రేణి హోదాలో ఉన్న జనగామలో ఈ పథకం అమలు కావడం లేదు. నూతన పాలకవర్గం ఏర్పాటు కాకపోవడంతో అధికారులు ఈ విషయమై చర్యలు తీసుకోలేకపోతున్నారు.

మార్కెట్ పరిధిలో అభివృద్ధి పనులు నిలిచిన విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది.. స్థలాభావం సమస్యను, పనులు పునః ప్రారంభించాల్సిన అవసరాన్ని ఉన్నతాధికారులకు వివరిస్తానని మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు.

విపణి ఆదాయం వివరాలిలా (రూ.కోట్లలో)..

2022-23లో	5.75
2023-24లో	6.30
2024-25లో	8.75 (అంచనా)


తుది దశలో నిలిచిన కొత్త కార్యాలయ భవనం


కొత్త షెడ్‌లో ఫ్లోరింగ్ పూర్తికాక.. వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారి

ఘన్‌పూర్‌కు స్కూల్ కాంప్లెక్స్ మంజూరు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పథకం కింద జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి స్కూల్ కాంప్లెక్స్ మంజూరైనట్లు కలెక్టర్ రిజ్వాన్‌బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 28 ప్రాంతాల్లో మంజూరు చేయగా ఇందులో ఘన్‌పూర్ ఒకటని పేర్కొన్నారు. నియోజకవర్గ శాసనసభ్యుడు కడియం శ్రీహరి కృషితో కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలోని నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందించాలనే ఉద్దేశంతో రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసి వసతులు కల్పిస్తున్నట్లు పాలనాధికారి వివరించారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మెరుగైన సేవలందించాలని జిల్లా పాలనాధికారి రిజ్వాన్ బాషా అన్నారు. ఆయన గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యుల హాజరు పట్టికను, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో డీఎస్ వెంకన్న, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


సామాజిక ఆరోగ్య కేంద్రంలో హాజరు పట్టికను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా


అమ్మాయిలు ఆది పరాశక్తులవ్వాలి! 6లో..

జాతి రత్నం.. రతన్ టాటా

● మనం నేర్చుకోవాల్సిన పాఠాలెన్నో

ఇనుమును ఏదీ నాశనం చేయలేదు. దానికి పట్టే తుప్పే దాన్ని అంతమొందిస్తుంది. అలాగే ఒక వ్యక్తి కూడా పతనమవ్వడానికి కారణం ఆయన ఆలోచన విధానమే కారణం.

- రతన్‌టాటా



వ్యాపారంలో లాభం కన్నా మానవత్వమే ముఖ్యమని చాటారు..
ఆకాశమంత ఎత్తుకు ఎదిగినా ఆవగింజంత గర్వం లేకుండా బతికారు..
ఏ రంగంలో అడుగుపెట్టినా కఠోర శ్రమతో అద్భుతాలు చేసి చూపించారు..
విలువలే ప్రాణంగా జీవించి లక్షలాది ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారు..
ఆపదలో ఉన్న వారికి సాయమందించి కోట్లాది మంది అభిమానం చూరగొన్నారు..
మీ మాట మా అందరికీ స్ఫూర్తి.. మీ బాట తరతరాలకు దీప్తి

ఈనాడు, వరంగల్


ఒక సినిమా హీరో కన్ను మూస్తే ఆయన అభిమానులు విలపించడం చూశాం. ఎందుకంటే ఆయన సినిమాలు చూసి చూసి నటనను మరచిపోలేరు కాబట్టి. ఒక గాయకుడు దివికేగితే దశాబ్దాల నుంచి ఆయన పాటలు విన్న శ్రోతలు కన్నీరు కార్చకుండా ఉండలేరు. ఓ పారిశ్రామికవేత్త ఈ లోకాన్ని వీడితే దేశం మొత్తం దిగులు చెందడం మాత్రం మొదటిసారి చూస్తున్నాం. ఎందుకంటే చనిపోయిన ఆ వ్యక్తి విలువలే ఊపిరిగా జీవించారు. వ్యాపారానికి మానవత్వాన్ని జోడించి అద్భుతాలు సాధించిన ఆయన టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా. ఈ వ్యాపార దిగ్గజం కన్ను మూసిన వార్త తెలియగానే దేశంలో కోట్లాది సామాన్య ప్రజల కళ్లు సైతం చెమర్చాయి. రతన్ టాటా మృతిపై ఉమ్మడి వరంగల్ ప్రజలు ఘన నివాళులు అర్పించారు. ఆయనతో అనుబంధం ఉన్న వారు జ్ఞాపకాలు పంచుకున్నారు. రతన్ విలువల జీవితం నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు..

మన క్రీడాకారులకు అండ

టాటా గ్రూప్ అనేక స్వచ్ఛంద కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో యువ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఝార్ఖండ్‌లో టాటా ఆర్చరీ అకాడమీని నెలకొల్పారు. ఈ అకాడమీలో ఓరుగల్లుకు చెందిన ఎంతో మంది క్రీడాకారులు శిక్షణ పొంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. కొన్నేళ్లుగా ఓరుగల్లుకు చెందిన విద్యార్థులు 11 మంది వరకు శిక్షణ పొందారు. ఇందులో ఏడుగురు ఉద్యోగాలు సాధించారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన వర్ధినేని ప్రణీత 2008లో ఒలింపిక్స్‌లో ఆర్చరీ క్రీడలో పాల్గొన్నారు. ఆమె కూడా టాటా సంస్థ నుంచే సుశిక్షితురాలయ్యారు. ప్రస్తుతం త్రిశూల్, నాగేశ్వర్ అనే ఇద్దరు విద్యార్థులు టాటా ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు.

ఎవరి స్టేటస్ చూసినా

రతన్ టాటా ఔదార్యాన్ని, గొప్ప లక్షణాలను గుర్తు చేసుకుంటూ ఉమ్మడి వరంగల్ ప్రజలు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేశారు.



ఓరుగల్లుకు చెందిన ఒకరు తన స్టేటస్‌గా పెట్టుకున్న పోస్టు

అందరికీ ఇలా ఆదర్శం..

వ్యాపారి: వ్యాపారం అంటే లాభాల కోసమే కాదు. అందులో మానవత్వం ఇమిడి ఉండాలని రతన్ చేసి చూపారు. లాభాలకన్నా విలువలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. 26/11 దాడుల తర్వాత తమ హోటళ్లను రీమోడలింగ్ చేసేందుకు టాటా సంస్థలు టెండర్లు పిలిచాయి.. ఇందులో పాకిస్థానీ కంపెనీలు పాల్గొనేందుకు ప్రయత్నించాయి. ఓ మంత్రితో రతన్ టాటాకు నేరుగా ఫోన్ చేయించారు.. వారికి టెండర్లు దక్కేలా చేయాలని ఆ మంత్రి చెప్పారు. వెంటనే రతన్ స్పందించి 'మీరు మానం లేని వారు కావొచ్చు.. నేను కాదు' అంటూ దీటైన సమాధానం ఇచ్చి వ్యాపారం కన్నా విలువలే ఎక్కువని నిరూపించారు.

ఉద్యోగి: సమయానికి రతన్ చాలా ప్రాధాన్యం ఇచ్చేవారు. సమయపాలన, క్రమశిక్షణ అనేవి చాలా ముఖ్యమని అనేక సమావేశాల్లో తమ సంస్థ ఉద్యోగులకు ఉద్బోధించేవారు. నిజాయతీగా పని చేస్తూ సంస్థ ఉన్నతికి తోడ్పడితే ఉద్యోగులు గొప్ప స్థానాలకు చేరుకుంటారని చెప్పేవారు. అలా టాటా కంపెనీలోని కింద స్థాయి నుంచి అత్యున్నత పదవులకు ఎదిగిన ఉద్యోగులు కోకొల్లలు.

విద్యార్థి: రతన్ ఎదుటి వారు చెప్పేది ప్రశాంతంగా వినేవారు. పూర్తిగా అర్థం చేసుకున్నాకే నిర్ణయాలు తీసుకునేవారు. వృద్ధాప్యంలోనూ ఎంతో శ్రమించేవారు. ఎంత ఎదిగినా నిరాడంబరంగా ఉండడం ఆయనలోని గొప్ప లక్షణం. విద్యార్థులు కూడా ఆయన నుంచి ఎన్నో సుగుణాలు నేర్చుకోవచ్చు.


జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో రతన్ టాటా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రజలు

చిన్నవారిని సైతం గౌరవిస్తారు..

- ముప్పిడి విజయ్‌కుమార్‌రెడ్డి, సెలక్ట్ గ్రూప్ (టాటా మోటర్ డీలర్), మేనేజింగ్ పార్ట్‌నర్, హనుమకొండ



రతన్ టాటా కన్నుమూయడం దేశానికి పూడ్చలేని నష్టం. ఆయన్ను నేను పదిసార్లు సమావేశాల్లో కలిశాను. చాలా నిరాడంబర వ్యక్తి. చిన్న వారిని సైతం గౌరవిస్తారు. ఎవరు సలహాలు ఇచ్చినా కాదనకుండా స్వీకరిస్తారు. అద్భుతమైన ప్రతిభావంతుడు. సమావేశంలో ఏదైనా అంశాన్ని తీసుకుంటే లోతుగా చర్చిస్తారు. మహా మేధావి. టాటా గ్రూప్ అనేక రంగాల్లో అడుగుపెట్టి విజయం సాధించిందంటే రతన్ దూరదృష్టి అని చెప్పాలి. ఆయన నుంచి జీవితంలో నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నా.

ఓరుగల్లు నుంచి..



టాటా సంస్థ అనేక రంగాల వ్యాపారాల్లోకి అడుగు పెట్టి విజయాలు సాధించింది. ఈ క్రమంలో 56 ఏళ్ల క్రితం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఏర్పాటు చేసింది. అదిప్పుడు దేశదేశాల్లో ఐటీ సేవలు అందిస్తోంది. ఈ సంస్థలో ఓరుగల్లుకు చెందిన వారు ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారు. టీసీఎస్ ఉపాధ్యక్షుడు (టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్)గా అత్యున్నత హోదాలో ఉన్న వి.రాజన్న వరంగల్ నిట్‌లో ఎంటెక్ పూర్తి చేశారు.

● టీసీఎస్ ప్రతి సంవత్సరం కంప్యూటర్ సైన్స్‌లో ఒక పీహెచ్‌డీ విద్యార్థికి ఉపకారవేతనాన్ని అందిస్తుంది. ప్రాంగణ నియామకాల్లో టీసీఎస్‌కు పదుల సంఖ్యలో నిట్ విద్యార్థులు ఎంపికవుతున్నారు.

'నేటి సమాజంలో జరుగుతున్న హింస, అరాచకాలను దృష్టిలో ఉంచుకుని.. ఆడపిల్లలను ఆది పరాశక్తులుగా తీర్చిదిద్దాలి. ఈ శరన్నవరాత్రుల్లో అమ్మవారు మనకు ఇచ్చే ధైర్యం అదే..

'ఆడపిల్లల సాధికారత, వారి హక్కుల సాధన కోసం సహాయం చేయడం వంటి లక్ష్యాలతో ఏటా అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. 'భవిష్యత్తు కోసం బాలికల దృష్టి' అనేది ఈ ఏడాది ప్రపంచ బాలికల దినోత్సవ నినాదం..

నేడు అంతర్జాతీయ బాలికా దినోత్సవం





కాశీబుగ్గలోని వివేకానంద విద్యా కేంద్ర ఆధ్వర్యంలో ఆత్మరక్షణ విద్యలో భాగంగా కర్ర సాములో శిక్షణ పొందుతున్న బాలికలు

అమ్మాయిలు.. ఆది పరాశక్తులవ్వాలి!

వరంగల్ కలెక్టరేట్, క్రైం, న్యూస్‌టుడే

శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని వివిధ అవతారాల్లో భక్తులు కొలుచుకుంటున్నారు. దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణ కోసం ఆ తల్లి అనేక రూపాలు ధరించారు. శుక్రవారం మహిషామర్దినిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.. ఆ అమ్మవారినే స్ఫూర్తిగా తీసుకుని ప్రతి బాలికా ముందడుగు వేయాలి. నేటి కాలంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేలా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి. నేడు అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం..

ఆత్మరక్షణ విద్యతో.. మహాకాళిగా..

సామాజిక మాధ్యమాల ప్రభావం.. ఇతర కారణాలతో బాలికలపై వేధింపులు ఎక్కువయ్యాయి. అడుగడుగునా జరిగే అరాచకాలు, ప్రేమ పేరిట ఆకతాయిల ఆగడాల నుంచి తమను తాము కాపాడుకునేందుకు.. ప్రతి అమ్మాయి మహాకాళిగా మారాలి. అందుకు కరాటే, కుంగ్‌ఫూ, జూడో వంటి ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం 2017 నుంచి ఆత్మరక్షణ విద్యకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు ప్రత్యేక శిక్షకుల ద్వారా మూడు నెలలపాటు కరాటేను నేర్పిస్తున్నారు.



వరంగల్ కృష్ణాకాలనీ ప్రభుత్వ పాఠశాలలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థినులు

ఆశావహ దృక్పథంతో.. శాకంబరిగా

ఓసారి భూమిపై తీవ్ర కరవుతో.. తల్లడిల్లిపోతున్న ప్రజలు అమ్మవారిని అర్థించడంతో.. అమ్మవారు కరుణించి వర్షాలు కురిపించింది. శాకాలను (కూరగాయలు) అందించిన అమ్మవారు శాకంబరిగా పూజలందుకుంటోంది. బాలికలు విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి. ఉన్నతస్థానాలకు చేరుకుని ఆపద సమయాల్లో శాకంబరిగామారి సమాజానికి అండగా నిలవాలి.

● పండితులు అమ్మవారి కళ్లను పద్మాలతో పోలుస్తుంటారు. ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించాలని అమ్మవారి నేత్రాల్లోని అంతరార్థం. జీవితంలో ఎలాంటి ఆటంకాలు ఎదురైనా.. సమయస్ఫూర్తితో, సూక్ష్మదృష్టితో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

చట్టాలతో రక్షణ కవచం..

కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్లల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించాయి. బాలల న్యాయ (పిల్లల భద్రత, సంరక్షణ) నమూనా సవరణ నియమాలు- 2022, అనైతిక రవాణా నిరోధక సవరణ బిల్లు- 2006, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం- 2019 ఇటీవల అమల్లోకి వచ్చాయి. లింగపరమైన దుర్విచక్షణను రూపుమాపడం, బాలికల చదువును ప్రోత్సహించడం, వారికి రక్షణ కల్పించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం 'బేటి బచావో-బేటి పఢావో' కార్యక్రమం అమలు చేస్తోంది.

● మిషన్ పోషణ్ కింద అంగన్‌వాడీల సేవలు, కిశోర బాలికా పథకం, పోషణ్ అభియాన్, మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య, జాతీయ బాలనిధి వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

బాలికలతో సంఘాలు..

కౌమారదశ బాలికల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ (యునిసెఫ్) సహకారంతో 'స్నేహ' (సేఫ్టీ న్యూట్రిషన్ ఎంపవర్‌మెంట్ హెల్త్ అండ్ అడోలెసెన్స్) కార్యక్రమాన్ని రూపొందించింది. కార్యక్రమ నిర్వహణ కోసం వరంగల్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికచేసింది. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పాఠశాల స్థాయిలోని 11-14 ఏళ్లు, జూనియర్ కళాశాల స్థాయిలోని 15 నుంచి 19 ఏళ్ల కౌమారదశ బాలికలతో గ్రామాల వారీగా సంఘాలుగా ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో ఎదుర్కొంటున్న సవాళ్లు, విద్యలో తక్కువ ప్రాధాన్యం, డ్రాపవుట్స్, బాల్య వివాహాలు, ఆరోగ్య సమస్యలపై దృష్టిసారిస్తున్నారు.

యుద్ధవిద్యల్లో నైపుణ్యం కలిగి ఉండాలి..



- విష్ణు, వివేకానంద విద్యా కేంద్రం నిర్వాహకుడు

ఆకతాయిల నుంచి ఆత్మరక్షణ కోసం అమ్మాయిలే అవసరాన్ని బట్టి ఆయుధం చేతబట్టి ఆది పరాశక్తి వలే పోరాడేందుకు సిద్ధంగా ఉండాలి. ఈ అవసరాన్ని గుర్తించి రెండేళ్లుగా కేంద్రంలోని అమ్మాయిలకు ఉచితంగా కర్రసాము, కరాటేలో శిక్షణ ఇస్తున్నాం.

స్వీయరక్షణకు తప్పనిసరి



- యాకూబ్ పాషా, కరాటే (షోటో కాన్) అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

స్వీయరక్షణతో పాటు పూర్తిస్థాయిలో ఆరోగ్యానికి కరాటే ఉపయోగపడుతుంది. ప్రభుత్వ ఆదేశానుసారం రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లోని ఆడపిల్లలకు కరాటేలో శిక్షణ ఇస్తున్నాం. కొంతమంది విద్యార్థినులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో కరాటే పోటీలకు పంపించాం.

ఆడ'పులులు' వీరు..

పదేళ్ల బాలిక అమ్మమ్మను కాపాడింది..

గతేడాది మహారాష్ట్రలోని పుణెలో రోడ్డుపై తన మనవరాళ్లతో కలిసి వాకింగ్ చేస్తున్న ఓ వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసు లాగేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. అప్రమత్తమైన ఆమె మనువరాలు పదేళ్ల రుత్వి ఆ చైన్‌స్నాచర్ ముఖంపై దాడిచేయడంతో.. అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటన సీసీటీవీలో రికార్డు కావడంతో.. సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

అమ్మను కాపాడేందుకు ఆటోనే ఎత్తింది..

గతనెలలో కర్ణాటక మంగళూరులో చేతన అనే మహిళ తన ఏడోతరగతి చదువుతున్న వైభవిని ట్యూషన్ నుంచి తీసుకొచ్చేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో ఓ ఆటో ఆమెను ఢీకొట్టి బోల్తా పడింది. ఆ ఆటో కింద ఆమె చిక్కుకుంది. వైభవి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా.. శక్తినంతా కూడగట్టుకుని అమాంతం ఆటోను పైకి లేపింది. అప్పటికే ఆటోలో ఇద్దరు ప్రయాణికులు ఉన్నారు. స్వల్పగాయాలతో ఆమె తల్లి బయటపడింది. తల్లిని కాపాడేందుకు ఎవరి సాయంలేకుండా.. ఆటోను పైకిలేపిన బాలిక ధైర్యసాహసాలను పలువురు ప్రశంసించారు.

రక్షణ కోసం యాప్..



బాలికలపై లైంగిక వేధింపులను అరికటేందుకు ఎన్‌సీపీసీఆర్ (నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్) 2020 జూన్‌లో 'పోక్సో ఈ-బాక్స్' యాప్‌ను తీసుకొచ్చింది. మహిళా శిశు సంక్షేమ అధికారులు, స్థానిక పోలీసులను సమన్వయం చేస్తూ ఇది పనిచేస్తుంది. యాప్‌లో నమోదుచేసిన ఫిర్యాదులు తక్షణమే స్థానిక అధికారులకు అందుతాయి. పోక్సో చట్టం-2012 ప్రకారం.. బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా ఎన్‌సీపీసీఆర్ పర్యవేక్షిస్తుంది. బాధితులు ఈ-మెయిల్, చరవాణి నంబర్, తదితర వ్యక్తిగత వివరాలను నమోదుచేయాల్సి ఉంటుంది. ఈ వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో యాప్ నిర్వహణపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరముంది.



● బాలికలు, మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకుని పోలీస్‌శాఖ, ఉమెన్ సేఫ్టీ వింగ్ సంయుక్తంగా 'టీ (ట్రావెల్)-సేఫ్' యాప్‌ను అభివృద్ధి చేశాయి. మహిళలు, బాలికలపై ప్రయాణ సమయాల్లో ఆకతాయిల వేధింపులు అరికట్టడానికి ఇది ఉపయోగపడుతుంది. ఈ యాప్ ద్వారా తమ సమస్యను తెలిపితే.. చాలు వెంటనే వ్యక్తి లొకేషన్ ఆధారంగా దగ్గర్లో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు సంక్షిప్త సమాచారం అందుతుంది. దాంతో పోలీసులు స్పందించి 5 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో దీన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలి.

CHILD LINE 1098 NIGHT & DAY

● బాలికలు ఆపద సమయాల్లో సంప్రదించేందుకు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 అందుబాటులో ఉంది.

● బాలికలు, యువతులు, మహిళలకు ఎక్కడ ఇబ్బంది ఉన్నా.. ఇప్పటికే షీటీం బృందాలు భద్రత కల్పిస్తున్నాయి. పోకిరీల ఆట కట్టించేందుకు మఫ్టీలో షీటీం బృందాలు పనిచేస్తున్నాయి. కళాశాలలు, బస్టాండుల్లో, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో నిఘా పెడుతూ.. ఈవ్‌టీజింగ్‌కు అడ్డుకట్టవేస్తున్నాయి.

రూ. 15.31 కోట్ల పంట నష్ట పరిహారం విడుదల

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 6 వరకు కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారాన్ని విడుదల చేసింది. 19,240 మంది రైతులకు చెందిన 15,316 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారుల సర్వేలో వెల్లడైంది. పత్తి, మొక్కజొన్న, వరి పంటలకు ఎక్కువ నష్టం జరిగింది. అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 18,406 మంది రైతులకు చెందిన 14,669 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఎకరానికి రూ.10 వేల చొప్పున 15316 ఎకరాలకు రూ.15.31 కోట్ల నిధులను విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

జిల్లా	రైతులు	పంట నష్టం (ఎకరాల్లో)
మహబూబాబాద్	18,406	14,669.22
వరంగల్	480	283.34
ములుగు	147	113.02
జనగామ	46	67.36
జయశంకర్	161	183.15

16 నుంచి పుణె- కాజీపేట ఎక్స్‌ప్రెస్

కాజీపేట, న్యూస్‌టుడే: ఈ నెల 16 నుంచి పుణె- కాజీపేట మధ్య వారాంతపు రైలు నడవనుంది. రాజ్యసభ సభ్యురాలు రజనీ అశోక్‌రావు వినతి, జడ్‌ఆర్‌యూసీసీ సమావేశం విజ్ఞప్తి మేరకు ఈ రైలును పునఃప్రారంభిస్తున్నారు. గతంలో కాజీపేట- పుణె మధ్య నడిచిన రైలును రద్దు చేసిన విషయం తెలిసిందే. బుధవారం పుణెలో ఉదయం 6.35 గంటలకు ప్రారంభమై గురువారం ఉదయం 6.30 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. కాజీపేటలో గురువారం ఉదయం 8.00 గంటలకు ప్రారంభమై శుక్రవారం ఉదయం 9.45 గంటలకు పుణె చేరుకుంటుంది. బల్లార్ష, నాందేడ్ మీదుగా ప్రయాణం చేస్తుంది.

22, 23న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ చదరంగం సంఘం సహకారంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో పోటీల కరపత్రాలను రాష్ట్ర చదరంగం సంఘం కోశాధికారి రవీందర్ ఆవిష్కరించారు. పోటీల వివరాలను కన్నా వెల్లడించారు. ఈ నెల 22, 23 తేదీల్లో అండర్-15 విభాగంలో హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో పోటీలు ఉంటాయన్నారు. 90595 22986లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పారా ఒలింపియన్ దీప్తికి సత్కారం

పర్వతగిరి: కల్లెడ గ్రామానికి చెందిన పారా ఒలింపిక్స్ కాంస్య పతక విజేత జీవాంజి దీప్తిని తన స్వగృహంలో గురువారం తహసీల్దార్ వెంకటస్వామి కలిసి సన్మానించారు. పతకం సాధించాక తొలిసారి ఆమె స్వగ్రామానికి వచ్చిన సమాచారం తెలియడంతో వారి ఇంటికి వెళ్లిన తహసీల్దార్ వెంకటస్వామి దీప్తితో పాటు ఆమె తల్లిదండ్రులు ధనలక్ష్మి, యాదగిరిలను సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. పల్లె పేరును ప్రపంచ దేశాలకు తెలియజేశావు.. మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

బాలుడి ఊపిరితిత్తుల్లో పల్లిగింజ

● చికిత్స చేసి తొలగించిన ఎంజీఎం వైద్యులు



ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు ఊపిరితిత్తుల్లోకి చేరిన వేరుశనగ(పల్లి) గింజను ఎంజీఎం వైద్యులు బ్రాంకోస్కోపి చికిత్స ద్వారా తొలగించి బాలుడి ప్రాణాలను కాపాడారు. సంక్లిష్టమైన ఈ చికిత్సను ఈఎన్‌టీ, మత్తు వైద్యుల బృందం సమర్థంగా నిర్వహించింది. ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.చిలుక మురళి తెలిపిన ప్రకారం.. ములుగు మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన ఎండీ హుస్సేన్ కుమారుడు అబ్దుల్ సమద్(2) వారంరోజుల నుంచి దగ్గు, ఆయాసంతో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఈ నెల 9న ఎంజీఎం ఆసుపత్రికి తీసుకువచ్చారు. సిటిస్కాన్ చేయగా.. బాలుడి కుడివైపు ఊపిరితిత్తిలో వేరుశనగ గింజను గుర్తించారు. డా.వెంకటరత్నం ఆధ్వర్యంలో ఈఎన్‌టీ బృందం డా.జాషువా, డా.రాంలాల్, అనస్తీషియా వైద్య బృందం సహకారంతో ఊపిరితిత్తిలోని వేరుశనగ గింజను బ్రాంకోస్కోపి పద్ధతిలో తొలగించారు. వైద్య బృందాన్ని ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి అభినందించారు. ఈ చికిత్స ప్రైవేటు ఆసుపత్రిలో చేయిస్తే రూ.2 లక్షలకు పైగా ఖర్చవుతుందన్నారు.

రైతుల ఖాతాల్లోకి కిసాన్ సమ్మాన్ నిధులు

న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం : యాసంగి పంటల సాగు పెట్టుబడికి ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులకు 18వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధులను గురువారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం దేశంలోని సన్నా చిన్నకారు రైతులకు చేయూతనిచ్చేందుకు 2019 ఫిబ్రవరి ఒకటి నుంచి ఎకరానికి ఏడాదికి రూ.6వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. సాగు భూమితో సంబంధం లేకుండా ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తించేలా కిసాన్ సమ్మాన్ పథకాన్ని రూపొందించారు. 2019 సంవత్సరం వరకు పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. వానాకాలం, యాసంగి సీజన్లలో కలిపి రూ.6 వేల రూపాయలను మూడు విడతలుగా నిధులను రైతుల ఖాతాలో వేస్తున్నారు. ఈ సంవత్సరం వానాకాలం సీజన్‌లో మొదటి విడత రెండు వేల రూపాయల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈకేవైసీ చేసుకున్న రైతులకు మాత్రమే ఈ సాయాన్ని అందిస్తున్నారు. ఈమేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో అర్హతగల 3,81,890 రైతు కుటుంబాలకు రూ. 2 వేల చొప్పున మొత్తం రూ. 76,37,80,000 నిధులు ఖాతాలో జమ చేశారు.

జిల్లాల వారీగా..

జిల్లా..	రైతుల సంఖ్య	నిధులు(రూ.ల్లో)
ములుగు	39,159	7,83,18,000
హనుమకొండ	56,409	11,28,18,000
జనగామ	81,487	16,29,74,000
వరంగల్	65,361	13,07,22,000
జయశంకర్	48,496	9,69,92,000
మహబూబాబాద్	90,978	18,19,56,000

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	109
రిటైల్:	131
డ్రెస్డ్:	190
స్కిన్‌లెస్:	216

వృద్ధులకు ఆరోగ్య కార్డులు!

కుటుంబ సభ్యుల ఆదరణ లేక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధులకు ఆసరాగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం కొత్త పథకం అందుబాటులోకి తెచ్చింది. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన(ఏబీపీఎం జేఏవై) పథకం కింద సామాజిక ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా 70 సంవత్సరాల పైబడిన వృద్ధులకు ఆరోగ్య కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ కార్డు కలిగిన వృద్ధులు సంవత్సరానికి రూ.5 లక్షల వరకు అదనపు టాప్ అప్(కుటుంబ సభ్యులతో పంచుకోవాల్సిన అవసరం లేకుండా) ఆరోగ్య రక్షణ బీమా పొందుతారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల నమోదు, కార్డుల జారీ, అమలు చేయనున్నారు. -ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలో 70 ఏళ్ల పైబడిన వారు
వరంగల్- 28,742
హనుమకొండ- 43,754
ములుగు: 11,787
భూపాలపల్లి- 16,671
మహబూబాబాద్- 30,982
జనగామ- 22,655

దరఖాస్తు చేసుకోవాలిలా

https:///ayushmanup.in పీఎంజేఏవై వెబ్‌సైట్ సందర్శించి ఆయుష్మాన్‌భారత్(ఏఎంఐ) ఎలిజిబుల్ ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. ఓటీపీ నమోదు చేసి చరవాణి నంబరును ధ్రువీకరించాలి. రాష్ట్రం, జిల్లా, మండలం వివరాలు, ఆధార్ కార్డు వివరాలు నమోదు చేయాలి. కేవైసీ పూర్తిచేసిన తర్వాత ఆమోదం కోసం వేచి ఉండాలి. కార్డు సిద్ధమైన తర్వాత అధికారికంగా ఆమోదం లభించిన వెంటనే కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రయోజనాలు ఇవీ

కనీసం రూ.5 లక్షల వైద్య సహాయం లభిస్తుంది. అందులో మూడు రోజుల పాటు ఉచితంగా ఆసుపత్రిలో చేర్చుకోవడం, వైద్య పరీక్షలు, చికిత్స, సలహా సేవలు, చికిత్స సమయంలో తలెత్తే సమస్యలు, ఇంటెన్సివ్ కేర్, నాన్ ఇంటెన్సివ్ కేర్ సేవలు లభిస్తాయి. ఆసుపత్రిలో చేరిన తర్వాత తదుపరి 15 రోజుల వరకు సంరక్షణ లభిస్తుంది. ఉచితంగా మందులు, వసతి ప్రయోజనాలు, పోషకాహారం వంటివి పొందవచ్చు.

నెలాఖరులోగా అమలు చేస్తాం

విక్రమ్, ఆరోగ్యశ్రీ ట్రస్టు మేనేజర్

కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకం కింద 70 సంవత్సరాల పైబడిన వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యకార్డుల జారీ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ ఈ నెలాఖరు వరకు పూర్తిచేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆరోగ్య కార్డు కోసం వృద్ధులు స్వయంగా తమ వివరాలు నమోదు చేసుకునేలా ప్రభుత్వం ఒక యాప్ రూపొందిస్తోంది. అది తుది దశలో ఉంది. విధి విధానాలు రాగానే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ద్వారా వీటి జారీ చేపడతాం.



ఇవి స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పాముసూర్ గ్రామంలోని రెండు పడక గదుల ఇళ్లు. 2018లో అప్పటి ఎమ్మెల్యే రాజయ్య 40 ఇళ్లకు శంకుస్థాపన చేశారు. నాలుగు ఇళ్లకు మాత్రమే స్లాబ్ వేసి వదిలేశారు. స్లాబ్‌లు వేసినవి ఇప్పుడు పశువుల పాకగా మారాయి.



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూర్ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న రెండుపడక గదుల ఇళ్లు. ఎనిమిదేళ్ల కిందట 40 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. గుత్తేదారు నిర్లక్ష్యంతో పనులు మధ్యలో ఆగిపోయాయి.

ఈ దసరాకూ పాలు పొంగించే భాగ్యం లేదు!

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే యంత్రాంగం

● రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారుల ఆవేదన

పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. ఈ దసరాకైనా తోరణాలు కట్టి.. పాలు పొంగించాలనుకున్నా రెండు పడక గదుల లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. చోట్ల నిర్మాణాలు పూర్తై.. లబ్ధిదారులు ఎంపిక జరిగి ఏళ్లు గడుస్తున్నా వారి చేతికి తాళాలు అందకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. వాటి మధ్యన పిచ్చి మొక్కలు మొలిచి శిథిలావస్థకు చేరాయి. కిటికీలు ఊడుతున్నాయి. కొన్ని చోట్ల పశువుల పాకలుగా మారాయి. ఇందుకు వెచ్చించిన రూ.కోట్లు వృథా అవుతున్నాయి.

జిల్లాల వారీగా రెండు పడక గదుల ఇళ్ల వివరాలు

	మహబూబాబాద్	జనగామ	హనుమకొండ	వరంగల్	భూపాలపల్లి	ములుగు
మంజూరైన ఇళ్లు	5567	4393	4326	6333	3882	1783
ప్రారంభించనవి	1,101	1373	107	2503	1343	247
పురోగతిలో ఉన్నవి	1963	1566	2076	1503	926	620
పూర్తైనవి	2503	1454	2143	2327	1613	916
పంపిణీ చేసినవి	1403	670	436	500	1197	పంపిణీ కాలేదు



బహుళ అంతస్తులతో కనిపిస్తున్నవి వరంగల్ నగరంలోని దేశాయిపేట శివారులో నిర్మించిన రెండుపడక గదుల ఇళ్లు. గత ప్రభుత్వ హయాంలో రూ.80 కోట్ల నిధులతో 200 ఇళ్లను నిర్మించారు. సకల సదుపాయాలతో నిర్మించినా పంపిణీ చేయకపోవడంతో నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. పోకిరీలు కిటికీలు, పైపులు, వాటర్ ట్యాంకులు పూర్తిగా ధ్వంసం చేశారు.


జనగామ రంగప్ప చెరువు ప్రాంతంలో..


లింగాలఘనపురంలో..


జనగామ రైల్వే స్టేషన్ ప్రాంతంలో..


తరిగొప్పుల: నర్సింగాపూర్‌లో..

సంబురంగా సద్దుల బతుకమ్మ



వర్షం కురుస్తున్నప్పటికీ జిల్లాలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గత తొమ్మిది రోజులుగా తీరొక్క పువ్వు, రోజుకొక తీరు నైవేద్యాలతో, ఆటపాటలతో అలరించి గురువారం ఆఖరి రోజైన సద్దుల బతుకమ్మను మమ్ములను సల్లంగ చూడమంటూ వేడుకొంటూ మహిళలు సంబరంగా సాగనంపారు. సద్దుల పండగ, దసరా పర్వదినానికి మూడు రోజులు ఉండటంతో ఉపాధికై పట్టణాల్లో ఉంటున్న కుటుంబాలు, పుట్టింటికి వచ్చిన ఆడపడుచులు, వారి పిల్లలతో పల్లెల్లో గృహాలన్నీ నిండుగా కనిపిస్తున్నాయి. మహిళలు బతుకమ్మను ఒకచోట చేర్చి ఆడిపాడి వచ్చే ఏడాది మరిన్ని సంబరాలు తెచ్చిపెట్టు గౌరమ్మ అంటూ సాగనంపారు.

– న్యూస్‌టుడే, బృందం




బతుకమ్మకుంటలో..


చిల్పూర్ మండలం మల్కాపూర్‌లో..


రఘునాథపల్లిలో..


దేవరుప్పుల: కామారెడ్డిగూడెంలో..


పాలకుర్తి ఊరచెరువు వద్ద..


స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో..


బచ్చన్నపేటలో..


నర్మెట్టలో..


జఫర్‌గఢ్: కూనూరులో..


కొడకండ్లలో..


జనగామ: గానుగుపహాడ్‌లో..


బచ్చన్నపేటలో ఆలేరు రహదారిలో..

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్: 80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

నర్మెట్ట, న్యూస్‌టుడే: నర్మెట్టలోని 1వ వార్డులో మురుగు కాలువ వ్యర్థాలతో నిండి దుర్వాసన వెలువడుతోంది. శుభ్రం చేయించాలి. **- కాలనీవాసులు**

సమాధానం: పరిశీలించి రెండు రోజుల్లో పరిష్కరిస్తాం. **- కె.శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి**

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని మసీదు పరిసరాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు ఇబ్బందిగా ఉంది. **- యాకుబ్, పాలకుర్తి**

సమాధానం: సిబ్బందితో వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- వెంకటేశ్వరచారి, పంచాయతీ కార్యదర్శి**

దేవరుప్పుల రూరల్: దేవరుప్పుల ఆర్టీసీ కాలనీలో సమీపంలో మురుగుకాల్వలో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉంది. దోమలు విజృంభిస్తున్నాయి. **- స్థానికులు**

సమాధానం: సిబ్బందితో వెంటనే శుభ్రం చేయిస్తాం. **- వెంకన్న, పంచాయతీ కార్యదర్శి**

వెలిగిన వీధి దీపాలు

స్పందనకు వందనం

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని కామారెడ్డిగూడెంలో గతంలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగడం లేదనే ప్రజల ఇబ్బందులను 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి స్వప్న దృష్టికి తీసుకెళ్లింది. ఆమె వెంటనే స్పందించి మరమ్మతుకు గురైన 20 స్తంభాలకు దీపాలను సిబ్బందితో మరమ్మతు చేయించారు.


రహదారులపై చెత్త తొలగింపు

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: మండలంలోని కోనాయచలంలో పలు వార్డుల్లో చెత్త పేరుకపోయి ఉన్నట్లు గ్రామస్థులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చెయించారు.

వీధులు శుభ్రం

జఫర్‌గఢ్: మండలంలోని సూరారంలో ప్రధాన వీధులు అపరిశుభ్రంగా ఉన్నాయని గ్రామస్థులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. తీసుకొచ్చారు. సమస్యను పంచాయతీ కారోబర్ రాజు దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో శుభ్రం చేయించారు.

ఈత చెట్టుకు గిజిగాడి పొదరిళ్లు



పుడమిపై ప్రతి జీవికి గూడు తప్పనిసరి. మానవులతో పాటు పక్షులు కూడా వర్షాలు, ఎండలు, ఇతర సందర్భాల్లో రక్షణగా ఉండేందుకు ఇళ్లు నిర్మించుకుంటాయి. ఆహార వేటలో రోజంతా వివిధ ప్రాంతాలు తిరిగినా, పొద్దుపోయేసరికి వాటి నివాస ప్రాంతాలకు చేరుతాయి. దేవరుప్పుల శివారులోని దాదాసాహెబ్ కాలనీకి వెళ్లే దారిలో ఒక ఈత చెట్టుకు పక్షులు పదుల సంఖ్యలో గూళ్లు ఏర్పరుచుకున్న దృశ్యం వాహనదారులు, పాదచారులను ఆకట్టుకుంటుంది. - న్యూస్‌టుడే, దేవరుప్పుల రూరల్

గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం


క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల, న్యూస్‌టుడే: పట్టణాలకే పరిమితమైన క్రీడలు నేడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాయని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. పల్లెల్లో పలువురు క్రీడాకారులు తమ ప్రతిభను కనబరుస్తున్నారని, వారికి ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. గురువారం కొడకండ్ల మండలం బోడతండలో ముగిసిన రెండు జిల్లాల స్థాయి కబడ్డీ క్రీడోత్సవాల ముగింపు సభకు హాజరై గెలుపొందిన వారికి నగదు బహుమతులు, షీల్డ్‌లు పంపిణీ చేశారు. మారుమూల తండాలో జిల్లా స్థాయి ఆటలు జరపడం పట్ల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే



బచ్చన్నపేట మండల కేంద్రం నుంచి బసిరెడ్డిపల్లి వెళ్లే రహదారిలో మూల కల్వర్టు పైభాగం లేకుండా ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈమార్గంలో పాదచారులు, ద్విచక్రవాహనదారులు, బస్సులు, లారీలు, రాకపోకలు సాగిస్తుంటారు. రహదారిలో గుంత, పక్కన రోడ్డుపై ఏర్పడిన పగుళ్లు ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బచ్చన్నపేట

దూరం.. కనపడదేం..!



లింగాలఘనపురం, న్యూస్‌టుడే: మండలంలోని పాలకుర్తి-జనగామ ప్రధాన రహదారిలో సూచిక బోర్డులను చెట్ల కొమ్మలు కప్పివేశాయి. గ్రామాల పేర్లు, దూరం సూచించే బోర్డులు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టిసారించి చెట్ల కొమ్మలు తొలగించాలని కోరుతున్నారు.

కొమ్మూరిని కలిసిన కమిటీ డైరెక్టర్

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన నాగబండి రవీందర్ గురువారం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి కృషిచేసినందుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట పజ్జూరి జయహరి ఉన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన అథ్లెట్లతో హనుమకొండ ఏసీపీ

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: ఈ నెల 7, 8న హనుమకొండలో జరిగిన పదో తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జనగామ అథ్లెట్లు ప్రతిభ కనబరిచినట్లు లక్ష్య కోచ్ తూడి రంజిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల విభాగంలో జి.సునీత్‌కుమార్ షాట్‌పుట్‌తో పాటు డిస్కస్ త్రోలో రెండు బంగారు పథకాలు, 18 సంవత్సరాల బాలికల విభాగంలో ఎం.అక్షయసింధు షాట్‌పుట్‌లో కాంస్య పథకం సాధించారు. 20 ఏళ్ల బాలుర విభాగంలో జె.రౌనాక్ హ్యామర్‌త్రోలో కాంస్య పథకం సాధించాడు. వీరిని హనుమకొండ ఏసీపీ కె.దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.సారంగపాణి, సంయుక్త కార్యదర్శి వెంకట్‌రెడ్డి అభినందించినట్లు పేర్కొన్నారు.

ఫ్లెక్సీలను తొలగించాలని నిరసన



జనగామ టౌన్, న్యూస్‌టుడే: బతుకమ్మకుంట మైదానంలో బతుకమ్మ, దసరా ఉత్సవాల సందర్భంగా పలు రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని వెంటనే వాటిని మున్సిపల్ అధికారులు తొలగించాలని కోరుతూ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రకటించారు. ఈ సందర్భంగా బూడిద గోపి, పానుగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఫ్లెక్సీల వల్ల సీసీ కెమెరాలు కనిపించకుండా ఉంటాయని, దీంతో చోరీలు జరిగే అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వాకర్స్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాతపుస్తకాల పంపిణీ



జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని గుండ్లగడ్డలోని ఉమామహేశ్వర దేవాలయంలో దుర్గామాత ఉత్సవాల్లో గురువారం స్థానిక పట్టణ సీఐ దామోదర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలనీలోని పలువురు విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు సాంబమూర్తి, చుంచు శ్రీకాంత్, రామిని శ్రీనివాస్, ప్రకాష్, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడికి సన్మానం

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: జనగామ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ లింగాలఘనపురం మండలాధ్యక్షుడు కొల్లూరి నర్సింహులు అలియాస్ శివకుమార్‌ను పార్టీ నాయకులు గురువారం సన్మానించారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దామెర నాగరాజు, కాంగ్రెస్ నెల్లుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు బత్తిని అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో నాయకులు కొత్తకొండ గంగాధర్, దామెర ప్రభాకర్, ఓరుగంటి రాజు, బత్తిని సాగర్, దామెర సాయికుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

చిల్పూర్, న్యూస్‌టుడే: క్రీడలతో యువతకు మానసికోల్లాసం కలుగుతుందని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. పల్లగుట్టలో పొట్లపల్లి చక్రధర్‌రావు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యాసనాలకు అలవాటు పడొద్దన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


పాలకుర్తి సోమేశ్వరాలయంలో..


రఘునాథపల్లి ఖిలాషాపురంలో..


స్టేషన్‌ఘన్‌పూర్ తాటికొండలో


లింగాలఘనపురం వనపర్తిలో..

దుర్గామాతగా అమ్మవారు

దేవి శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు దుర్గామాతగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పలు చోట్ల ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

–న్యూస్‌టుడే, యంత్రాంగం


నర్మెట్ట: వెల్దండలో హోమం చేస్తున్న భక్తులు

చికిత్స పొందుతూ రైతు మృతి

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: బతుకమ్మ పూల కోసం చెట్టుపైకి ఎక్కిన రైతు గాయపడ్డాడు. చికిత్స పొందుతూ సద్దుల బతుకమ్మ వేడుక రోజే మృతి చెందాడు. వివరాలివి.. లింగాలఘనపురం మండలం వడ్డిచర్లకు చెందిన రైతు వట్టిపల్లి వీరస్వామి(40) ఈ నెల 2న ఎంగిలి పూల బతుకమ్మకు పూలు తెచ్చేందుకు చెట్టు ఎక్కాడు. చెట్టుపై ఉన్న విద్యుత్తు తీగలు తాకడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గ్రామంలో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: రఘునాథపల్లి మండలం కోమాళ్ల టోల్‌గేట్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి జనగామ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న ఆటో దాన్ని ఢీకొంది. కోమాళ్లకు చెందిన ఆటో డ్రైవర్ బొల్లపల్లి నరేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు బాధితున్ని జనగామ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. విచారణ చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

రైతు రుణమాఫీకై నిరాహారదీక్ష

కొడకండ్ల, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత విఫలమైందని, మాఫీ చేయాలని కోరుతూ రాష్ట్ర జీసీసీ మాజీ ఛైర్మన్, భారాస నాయకుడు గాంధీనాయక్ గురువారం కొడకండ్ల మండలం మొండ్రాయిలోని వారి నివాసం వద్ద 48 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. అధికారంలోకి వచ్చి 10 మాసాలు గడుస్తున్నా, నేటికి 40 శాతం మందికే మాఫీ జరిగిందని ఆరోపించారు. కర్షకుల తరపున దీక్ష చేపట్టానని, ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షకు మండల భారాస నాయకులు సంఘీభావం ప్రకటించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: తమ్మడపల్లి(జి)కి చెందిన ఎల్మకంటి పెద్ద సోమయ్య అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బైండ్ల (భవదీయ)కుల సంఘ సభ్యులు గురువారం పరామర్శించారు. సంఘం కమిటీ సభ్యులు బాధిత కుటుంబానికి రూ.14 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సారంగపాణి, సాయికుమార్, అబ్బయ్య, సుధాకర్, శ్రీరాములు, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు తెగి రెండేళ్లు.. మరమ్మతులు ఎన్నేళ్లు..?

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: నూతనంగా రోడ్డు నిర్మాణం పనులు పూర్తికావడంతో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది.. మండలంలోని తమ్మడపల్లి(ఐ), ఉప్పుగల్లు వంతెన వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు దశాబ్దకాలంగా ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించుకున్నారు. ఎట్టకేలకు ఉప్పుగల్లు గ్రామానికి చెందిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ చొరవతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.50 లక్షలు మంజూరయ్యాయి. పనులకు అప్పటి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య 2022 ఫిబ్రవరి 28న శంకుస్థాపన చేశారు. ఉప్పుగల్లు నుంచి తమ్మడపల్లి(ఐ) చెరువు కట్ట వరకు రోడ్డు నిర్మాణ పనులను గుత్తేదారు సకాలంలో పూర్తి చేశారు. 2022 జులైలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డుతో పాటు కల్వర్టులు కోతకు గురయ్యాయి. రెండేళ్లు గడుస్తున్నా నేటికి మరమ్మతు మొదలు పెట్టకపోవడంతో ఈ రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హనుమకొండ, వరంగల్‌కు వెళ్లడానికి ఈ రహదారి ఎంతో అనుకూలంగా ఉండేది. మరమ్మతులు చేయడంలో ఎమ్మెల్యే, ఎంపీ నిర్లక్ష్యం చేస్తున్నారని ఉప్పుగల్లు మాజీ సర్పంచి గాదెపాక చిరంజీవి అన్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ రామకృష్ణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదిక పంపామని చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.


భారీ వర్షాలకు తెగిపోయిన రోడ్డు, కల్వర్టు